
# వింత పశువు



అప్పిగాడి తల బొప్పి కట్టింది! కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. ఎంత కప్పిపుచ్చుకుందామన్నా కుదరక భోరుమని ఏడ్చేశాడు! బొప్పికి కారణం - అప్పిగాడు చదూకుంటానని తన తండ్రితో చెప్పడమే! "యదవనాయాలా సదువు కావాలా..." అని అప్పి గాడి తండ్రి రంకె వేశాడు. నాతోపాటు సేద్యం చేసుకోక నువ్వు సదూకుంటుంటే నన్ను చోద్యం సూడమంటావా" అని వావ బాదేడు!

కొండంత దుఃఖం గుండెలో పొంగింది. రెండ్రోజులుగా పక్కింటి కరణంగారి అబ్బాయి శంకరం చెప్పించిన 'ఏ బి సి డి'లు గుర్తుకొచ్చేయి. శంకరం బాబుగారి మాటలూ గుర్తుకొచ్చేయి -

"విద్య లేనివాడు వింత పశు వన్నారు! చదూకున్నవాడికి దొరికినంత గౌరవం, మర్యాద ఎవరికీ దొరకదు. మన దగ్గర దొంగిలించలేని ధనం విద్యొక్కటే" బియ్యే పూర్తిచేసిన శంకరం మాటలు అప్పిగాడి మనస్సులో బలంగా నాటుకున్నాయా రోజు! మరీనాడు చదూకుంటానంటే అయ్య ఎముక లేరేస్తున్నాడు! ఏం చెయ్యాలో పాలు పోలేదు పదేళ్ళ అప్పిగాడికి!!

**　　**　　**

తెల్లవారి లేచి వేపపుల్లతో పళ్ళు తోముకుంటున్న అప్పిగాడికి పక్కింటి కరణంగారింటి ముందు జనం గుమిగూడి వుండడంతో ఆశ్చర్యంగా వెళ్ళి చూసేడు.

లోపల్నించి పెడబొబ్బలు వినిపిస్తున్నాయ్!

లోపలికెళ్ళి చూసేడు! అప్పిగాడి ఎద కుదేసి నట్టయ్యింది!

అక్కడ... పైన చూరుకు తాడుతో వురి వేసుకున్న శంకరం శరీరం వేలాడుతోంది నిర్జీవంగా!

"...పట్నం సదువు సదివి ఇన్నేళ్ళైనా వుద్యోగం రాకపోవడంతో ఈ గోరం సేసుకున్నాడు" ఎవరో చెప్తున్నారు ఇంకొకరితో! అప్పిగాడికిప్పుడు పుస్తకాలు శవపేటికల్లా కనిపిస్తూంటే తండ్రి సాగుచేస్తున్న పొలం వైపు సాగిపోయాడు!

- మణిగోపాల్

---

నెమ్మదిగా కన్నులు విప్పి చూసేసరికి ప్రశాంతంగా వుండవలసిన ప్రదేశం అంతా జనం పరుగులతో నిండిపోయింది. అందరూ అప్రమత్తంగా వున్నారు.

ఇంత హడావుడికి కారణం విష్ణుమూర్తికి డెలివరీ డేట్ ఆ రోజే. విష్ణుమూర్తిలో ఏ మార్పూ లేదు. బాధ, దుఃఖం ఎటువంటి చలనం లేదు. అందరిలోనూ ఆందోళన పెరిగిపోతోంది. ఇదేమీ పట్టించుకోని విష్ణుమూర్తి ఒక చేతిని తల క్రింద పెట్టి రెండవ చేతిని ఎడమకాలిపై వేసుకుని చిరునవ్వుతో అందరివంక పరికిస్తున్నారు. ఆ క్షణంలో అందరినీ మాయకమ్మి నట్టయింది. కళ్ళువిప్పి చూసేసరికి విష్ణుమూర్తి నాభి నుంచి బంగారు కాంతులీనే ఎర్రని మొగ్గ వస్తోంది. ఒకటిగా... రెండుగా... వెయ్యి రేకులు విచ్చుకుని అందులోంచి నాలుగు ముఖాలతో 'ప్రజాపిత' అయిన ప్రజాపతి బ్రహ్మ ఉద్భవించాడు. లక్ష్మీదేవి మనసు ఉప్పొంగిపోయింది. గంధర్వులు ఆనంద భైరవి రాగం ఆలపిస్తుంటే కిన్నెర కింపురుషులు ఆనంద తాండవం చేస్తుంటే ఇంద్రుడు ఆనందోత్సాహాలతో తన సభవారందరికీ ఆ శుభ సందర్భంలో సెలవు ప్రకటించారు. ఆకాశవాణి వార్తలు చదివే నారదుడు మురారి 'కుమారుని' ప్రసవించాడు అని వినిపించాడు.

ఏ కష్టం లేకుండా తన తండ్రి తనను ప్రసవించినప్పటికీ తనకి ఆ యోగం వుందో లేదోననే భయంతో సృష్టించే పదవి తనకి రాగానే పిల్లల్ని కనే భారాన్ని పురుషుల నుంచి స్త్రీలకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. పుట్టుకతోనే స్థితపరుడయ్యాడు కమలాసనుడు, చతుర్ముఖుడు అయిన 'మురారి సుతుడు.'*

— రోహిణి



---

# పొదుపు

పొరుగూర్లో తనకంటే గొప్ప పిసినారి అయిన ధనవంతుడు రంగయ్యను కలిసి పొదుపు చేయడంలో ఇంకా కొన్ని మెలకువలు, జాగ్రత్తలు, పొదుపు వలన ప్రయోజనాలు అడిగి తెలుసుకుందామని పొరుగూరు బయలుదేరాడు సూరయ్య.

సాయంత్రం దీపాల వేళ అయింది. సూరయ్య వెళ్ళేసరికి రంగయ్య తనకున్న చిన్న పూరిపాక అరుగుమీద నూనె దీపపు కాంతిలో వడ్డీ లెక్కలు చూసుకుంటూ కూర్చునివున్నాడు. అతని చేతిలో విసనకర్ర కదలకుండా స్థిరంగా వుంది. తలను మాత్రం విసనకర్రకు దగ్గరగా అటూ ఇటూ త్రిప్పుతూ వున్నాడు. సూరయ్య రంగయ్యను పరిచయం చేసుకుని తను వచ్చిన పని చెప్పి వినయంగా నమస్కరించాడు. రంగయ్య వడ్డీల పద్దుల పుస్తకాన్ని, విసనకర్రను జాగ్రత్తగా పక్కన పెట్టి సూరయ్యను అరుగుమీద కూర్చోమని చెప్పి నూనె దీపం ఆర్పేశాడు.

"ఇదేమిటండీ దీపం ఆర్పేశారు?" అన్నాడు సూరయ్య ఆశ్చర్యంగా.

"నేను నోటితో చెప్పేది నీవు చెవులతో వింటావు. మధ్యలో దీపం ఎందుకు నూనె ఖర్చు. ఆ నూనెతో మరొక రోజు దీపం వెలిగించుకో వచ్చు. అలాగే పొదుపులో రకాలు వున్నాయి. నేను విసనకర్రతో విసురుకోను. అది నలిగిపోతుందని దాన్ని జాగ్రత్తగా స్థిరంగా పట్టుకుని తలను మాత్రం అటూ ఇటూ త్రిప్పుతాను. దీనివల్ల విసనకర్ర తరతరాలుగా చెక్కుచెదరదు" అంటూ "ఇక పొద్దుపోయింది. నీవు వెళ్ళిరా" అంటూ దీపం వెలిగించబోయాడు రంగయ్య.

సూరయ్య కంగారుగా "ఆగండి దీపం వెలిగించ వద్దు" అంటూ లేచి నిలబడ్డాడు.

"ఏమైంది?" అని అయోమయంగా అడిగాడు రంగయ్య దీపం వెలిగించడం ఆపి.

"ఇందాక మీరు దీపం ఆర్పినపుడు పంచ విప్పి మడతబెట్టి చేత్తో పట్టుకుని కూర్చున్నాను. మట్టి అరుగుమీద మాసిపోతుందని. చీకట్లో మీరు చెప్పేది నేను వినడం కోసం మధ్యన ఇస్త్రీ పంచ నలగడం దేనికని" అంటూ స్వగతంగా "దీని దుంపతెగ మూడు సంవత్సరాలు అయింది దీన్ని ఉతికి ఇస్త్రీచేసి. ఇంకా నలగలేదు" అని పైకే అన్నాడు పంచ మడత జాగ్రత్తగా విప్పి కట్టుకుంటూ.

రంగయ్య అమాంతం సూరయ్య కాళ్ళమీద పడి "మహాప్రభో మీరే నాకన్నా గొప్ప పొదుపరులు. నేనే మీ నుంచి చాలా నేర్చుకోవాలి. మీరే నా గురువు" అన్నాడు.

—బి. అమితా భాస్కర్